క్లుప్తంగా

పెద్దమ్మ తల్లి కాంస్య విగ్రహం ఏర్పాటు



పెద్దమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు

యాడికి: మండలంలోని వేములపాడు గ్రామంలో ఆదివారం పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన సారెడ్డి నరసింహారెడ్డి, ఈశ్వర రెడ్డి, రంగనాయకులు రెడ్డి తమ సొంత నిధులతో పాటు గ్రామస్తులతో విరాళాలు సేకరించిన రూ.2 లక్షల నిధులతో కాంస్య విగ్రహం తయారు చేయించారు. ఆదివారం ఉదయం పురోహితుడు జనార్దన శర్మ పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి టెంకాయలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పందుల నుంచి పంటలు కాపాడండి



ధ్వంసమైన పంటను చూపుతున్న రైతు

యాడికి: పందులు పంట పొలాలను ధ్వసం చేస్తున్నాయని ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన పురుషోత్తం నాయుడు బుగ్గ రోడ్డు సమీపంలోని తోటలో ఆరు ఎకరాల్లో మొక్కజొన్నను సాగు చేశాడు. పొలం చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేశాడు. అయినా శనివారం రాత్రి గ్రామ పందులు ఇనుప కంచెను దాటి మొక్కజొన్న పంటను నేలమట్టం చేశాయి. ఆదివారం ఉదయం పొలానికి వెళ్లిన రైతు ధ్వంసమైన పంటను చూసి కన్నీటి పర్యంతమయ్యాడు. రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. పంచాయతీ అధికారులు గ్రామంలోని పందులను అడవులకు తరలించడంతోపాటు పంట నష్ట పరిహారం ఇవ్వాలని కోరాడు.

రంజాన్ తోఫా పంపిణీ



ముస్లింలకు సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న మదరసాలో ఆదివారం విఫాఖుల్ ఉలామ ఆధ్వర్యంలో 150 మంది ముస్లిం పేద కుటుంబాలకు ఉచితంగా రంజాన్ తోఫా అందజేశారు. మదరసా అధ్యక్షులు మౌలానా అబ్దుల్ హక్, ఎంకే చౌదరి తదితరులు పేదలకు రంజాన్ తోఫా (బియ్యం, బేడలు, చక్కెర, కంది పప్పు, నూనె, చింత పండు) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ పవిత్ర మాసంలో ముస్లిం పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఒక్కొక్కరికి రూ.2,500 విలువైన నిత్యావసర సరుకులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రసూల్,ఖాజా మొహిద్దిన్, షెక్షావలి, ఫజులుల్లా, ఖలీద్, బాషా, సాయి ,హేమచంద్రిక తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి: గుత్తి ఆర్ఎస్ రోడ్డులో ఆదివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ముందు వెళుతున్న ఆటోను బైక్ ఢీ కొనడంతో.. బైక్‌లో ఉన్న మధు, నరసింహులు గాయపడ్డారు. జొన్నగిరికి చెందిన వారు బైక్‌లో పని మీద గుత్తికి వచ్చి తిరిగి వెళుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా ఆరాధనోత్సవం



ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్

పామిడి: మండలంలోని అన్ని చర్చీలలో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ ప్రసంగించారు. మనందరి పాపాల కోసం క్రీస్తు శిలువలో తన ప్రాణాన్ని క్రయధనంగా పెట్టారన్నారు. తన అమూల్యమైన రక్తాన్ని చిందించి మనల్ని వెల పెట్టి కొన్నారన్నారు. ఆయన విమోచన క్రయధనాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి క్రీస్తుకు మహిమకరంగా నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు వీరయ్య, జయరాజు, జకరయ్య, హోసన్నా, రాజు, నరేష్, పాస్టరమ్మ సువర్ణమ్మ, డాక్టర్ కమల, రేచెల్, మెర్సీ, మహిమ, లత, సంధ్య, జ్యోతి, భారతి, రమాదేవి, క్రైస్తవులు పాల్గొన్నారు.

సిరులు కురిపిస్తున్న దానిమ్మ

- టన్ను ధర రూ.1.28 లక్షలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



పీఎం కొండాపురం వద్ద దానిమ్మ తోట, (ఇన్‌సెట్) విరగ్గాసిన దానిమ్మ కాయలు

యల్లనూరు: ఆరుగాలం శ్రమించి సాగు చేసిన దానిమ్మ పంట రైతు ఇంట సిరులు కురిపిస్తోంది.ఆరోగ్యానికి అమృతంగా పిలిచే దానిమ్మ పండుకు మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. ధరలు భారీగా పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తెగుళ్ల కారణంగా సాగు విస్తీర్ణం తగ్గడంతోనే ధరలు పెరిగాయని అన్నదాతలు చెబుతున్నారు. శింగనమల నియోజకవర్గంలో దాదాపు 1,700 హెక్టార్లలో దానిమ్మ సాగు విస్తరించింది. దానిమ్మ సాగు కోసం ఎకరాకు రూ.90 వేల నుంచి రూ.1.2 లక్షల వరకూ పెట్టుబడి పెడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఎకరాకు 350 నుంచి 400 మొక్కల చొప్పున దానిమ్మ మొక్కలను సాగు చేస్తారు. గత కొన్నేళ్లుగా దానిమ్మ సాగులో తెగుళ్ల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. అయితే తెగుళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటున్న రైతులు మాత్రం లాభాలు ఆర్జిస్తున్నారు. దానిమ్మ ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను రూ.1.28 లక్షలకు చేరుకోవడం రైతులకు ఆనందాన్ని నింపుతోంది.

ఉద్యాన పంటలకు నిలయం..

జిల్లాలో యల్లనూరు మండల ఉద్యాన పంటలకు పెట్టింది పేరు. మండలంలో అరటి 4,008 ఎకరాలు, మామిడి 112 ఎకరాలు, దానిమ్మ 1,232 ఎకరాలు, చీనీ 11,330 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. వేరుశనగ తదితర పంటలతో ఏటా నష్టాలు వస్తుండడంతో రైతులు ఉద్యాన పంటలు సాగు చేసి లాభాలు గడిస్తున్నారు. మండలంలోని పీఎం కొండాపురం గ్రామానికి చెందిన మోహన్‌బాబు నాలుగున్నర ఎకరాలో 1,740 దానిమ్మ మొక్కలను నాటాడు. అమ్మళ్లదిన్నె కొత్తపల్లిలో బగ్వా రకం గాలి అంట్లు గూటీలు అనే రకం ఒక్కో మొక్కను రూ.25



తో కొనుగోలు చేసి సాగు చేశాడు. ఆరేళ్ల నుంచి ఆదాయం పొందుతున్నాడు. పంటకు సేంద్రియ ఎరువుల వాడకం, ఆధునిక పద్ధతుల్లో బిందుసేద్య పరికరాల వల్ల నీటి వాడకంతో తెగుళ్లను నియంత్రించవచ్చని రైతు తెలిపాడు. ఎరువులు, బిందు సేద్య పరికరాలు తదితరం కలిపి రూ.10 లక్షలు వెచ్చించాడు. ఇటీవల టన్ను రూ.1.28 లక్షలతో 26 టన్నులు విక్రయించాడు. పెట్టుబడి పోనూ రైతుకు రూ. 23 లక్షలు లాభం వచ్చింది. అలాగే పాతపేటకు చెందిన మల్లికార్జునరెడ్డి 15 ఎకరాల్లో దానిమ్మ సాగు చేయగా 30 టన్నుల దిగుబడి వచ్చింది. ఎన్ని పంటలు సాగు చేసినా ఇంత లాభం రాదని తోటి రైతులు దానిమ్మ పంటలపై మొగ్గు చూపుతున్నారు. ఏడాదిలో ఆరునెలలకు ఒక్కసారి మాత్రమే దానిమ్మ పంట దిగుబడికి పెట్టుకోవాలని అన్నదాతలు అంటున్నారు. మిగిలిన ఆరునెలలు బీడు భూమిపెట్టి ఎరువులు వేసి పెట్టాలన్నారు. ఆగస్టు నుంచి ఫిబ్రవరి నెలాఖరులోగా కోతలకు వచ్చేలా చూసుకోవాలన్నారు. పంట దిగుబడులను వ్యాపారులు తోటల వద్దకు వచ్చి కొనుగోలు చేసి ఢిల్లీ, బెంగుళూరు, తిరుచ్చి, కేరళ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

తెగుళ్లు నివారించుకోవాలి



ఆరేళ్ల నుంచి దానిమ్మ పంటను సాగు చేస్తున్నా. ఎరువుల వాడకం, దానిమ్మ చెట్లకు నీరు వదలడం వంటి వాటిపై జాగ్రతలు పాటిస్తుంటా. తెగుళ్ల సమయంలో పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నా. తెగుళ్లు లేకుండా చేసుకుంటే లాభాలు అర్జించవచ్చు. గత మూడేళ్లుగా రూ. 15 లక్షలకు ఏ మాత్రం లాభం తగ్గడం లేదు. కష్టపడినందుకు ఫలితం దక్కింది. తోటి రైతులకు దానిమ్మ పంటలో సందేహాలు ఉంటే నివృత్తి చేస్తుంటా. – మోహన్‌బాబు, రైతు, పీఎంకొండాపురం

30 టన్నుల దిగుబడి



15 ఎకరాల్లో దానిమ్మ పంట సాగు చేశా. 30 టన్నుల దిగుబడి వచ్చింది. టన్ను రూ.లక్షకు పైగా విక్రయించగా పెట్టుబడులు పోను లాభం వచ్చింది. దానిమ్మ పంటను సాగు చేసే సమయంలో తెగుళ్లను ఎప్పటికప్పుడు నియంత్రించాలి. అకాల వర్షాలకు కొద్దిపాటి నష్టం జరుగుతుంది. ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో రైతులు కంటికి రెప్పలా దానిమ్మ మొక్కలను కాపాడుకోవాలి. – మల్లికార్జునరెడ్డి, రైతు పాతపేట , యల్లనూరు

వేసవిలో జాగ్రత్తలు పాటించండి



వేసవి కాలంలో ఎండ తీవ్రతలకు మొక్కలు ఎండిపోకుండా మల్చింగ్ కవర్లను వాడాలి. తెగుళ్ల సమయంలో ఉద్యానశాఖాధికాధికారుల సూచనలు పాటించాలి. ఆర్గానిక్, పెస్టిసైడ్ మందులను పిచికారి చేస్తే తప్పకుండా అధిక దిగుబడులు సాధిస్తారు. ఉద్యాన పంటల్లో చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి. పలువురు రైతులు సేంద్రియ ఎరువులు, బిందు సేద్య పరికరాలు వాడుతూ అధిక లాభాలు అర్జిస్తున్నారు. – ఉమాదేవి, ఉద్యాన శాఖాధికారిణి , తాడిపత్రి

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

యాడికి: మండల కేంద్రంలోని స్టార్ పారడైజ్ ఇంగ్లిషు మీడిఎం స్కూల్లో ఆదివారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెట్ లారెన్స్‌బాబు , మేనేజ్‌మెంట్ నాగేంద్ర, ఇలాహి, రంగ మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలను అడియాసలు చేయకుండా విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం సరస్వతీ దేవి చిత్రపటానికి విద్యార్థులు పూజలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కానిస్టేబుల్ అభ్యర్థులకు పరీక్ష



పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

గుంతకల్లుటౌన్: స్థానిక శ్రీసాయి మహిళా డిగ్రీ కళాశాలలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏపీ పోలీస్ కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఆదివారం అనంతపురం శ్రీధర్స్ కోచింగ్ ప్రతినిధుల సౌజన్యంతో నిర్వహించిన ఈ టాలెంట్ టెస్ట్‌లో 48 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. ఏపీ, తెలంగాణాలో ఏకకాలంలో ఈ పరీక్షలు నిర్వహించారని, ఈ పరీక్షలో రాణించిన మొదటి ముగ్గురికి నగదు బహుమతులను అందజేస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ ప్రభాకర్, డీవైఎఫ్ఐ కార్యదర్శి సురేంద్ర, శ్రీధర్స్ కోచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



పుల్లయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్ బీ

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, శనక్కాల వ్యాపారి పుల్లయ్య(75) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలు.. పుల్లయ్య ఇంటిలో నిద్రిస్తున్న సమయంలో చాతీలో విపరీతంగా నొప్పి వచ్చింది. ఆసుపత్రికి తరలించడానికి కుటుంబ సభ్యులు ప్రయత్నిస్తుండగానే మృతి చెందాడు. అతడికి కుమారుడు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి గురు ప్రసాద్ యాదవ్, కోడలు మున్సిపల్ వైస్ చైర్మన్ వరలక్ష్మి, మరో ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి, గుత్తి పట్టణ కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, జిల్లా నాయకులు మంజునాథ్‌రెడ్డి, రాజ్‌కుమార్ రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు , టీడీపీ నాయకులు సంతాపం తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామరించారు.

ఫ్రూట్ కవర్లతో మామిడి కాయలకు రక్షణ



మాట్లాడుతున్న సైంటిస్టు డాక్టర్ రామసుబ్బయ్య

పామిడి: కాయదశలో ఉన్న మామిడికి ఫ్రూట్ కవర్లు ధరింపజేయడం వల్ల రసంపీల్చే పురుగులు, ఈగలు ఆశించకుండా నివారించవచ్చని పుట్టపర్తి ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ సైంటిస్టు డాక్టర్ రామసుబ్బయ్య సూచించారు. ఆదివారం పామిడిలో దళిత రైతులు సాగుచేస్తున్న మామిడి తోటలను ఆయనతో పాటు హార్టికల్చర్ ఆఫీసర్ జీ మిత్రవింద మాధవి పరిశీలించారు. పూతదశలోని మామిడికాయపై రసంపీల్చే పురుగు ఆశించి ఉండడాన్ని ఆయన గమనించారు. ఈ సందర్భంగా ఆయన మామిడి సాగుపై రైతుల శిక్షణ అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. లీటర్ నీటికి 1.5 గ్రాముల హెక్సేట్ (లేదా) 0.4 మిల్లీలీటర్ల కాన్ఫిడార్ కలిపి పైరుపై పిచికారి చేయడం వల్ల రసంపీల్చే పురుగులను ఆశించకుండా నివారించవచ్చన్నారు. అలాగే కాయదశలో ఫ్రూట్ కవర్లు ధరింపజేయడం వల్ల రసంపీల్చే పరుగులు, ఈగలు ఆశించకుండా నివారించవచ్చన్నారు. తద్వారా రైతన్నలు నాణ్యమైన కాయలు పొందవచ్చునన్నారు. పూతదశలో సక్రమంగా మొక్కకు నీటిని అందించాలన్నారు. మామిడిలో సమగ్ర సస్య రక్షణ యాజమాన్య పద్ధతులను పాటించడం వల్ల అధిక దిగుబడి సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన, వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

'కోటంక'లో ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకులు రామాచార్యులు అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకార్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

పెద్దవడుగూరు: మండలంలోని కాశేపల్లి టోల్‌గేట్ వద్ద ఇసుక అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను ఎస్ఐ ఆంజనేయులు సీజ్ చేశారు. ఆదివారం టోల్‌గేట్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా పామిడి మండలం నుంచి పెద్దవడుగూరు మండలం మీదుగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్ ను గుర్తించి సీజ్ చేశామని ఎస్ఐ తెలిపారు. మండలంలో ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

గార్లదిన్నె: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరి ష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఈరమ్మ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. ప్రజలు అర్జీలు ఇస్తే సంబంధిత అధికారులకు అందజేసి సమస్యలు పరిష్కరించేలా చూస్తామన్నారు.

యల్లనూరు: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఇన్‌చార్జ్ తహసీల్దారు రాజా సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రజలు అర్జీలతో వచ్చినప్పుడు.. సంబంధిత అధికారులు అందుబాటులో ఉండాలన్నారు.

బ్యాంకు అభివృద్ధికి కృషి చేయండి

తాడిపత్రి రూరల్: టౌన్ బ్యాంకు అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటు పడాలని మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని కృష్ణదేవరాయ కల్యాణమండపంలో ఆదివారం 103వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో 2025–26 సంవత్సర వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొండి బకాయలను చెల్లించాలని కోరారు. బ్యాంకులో డబ్బును డిపాజిట్ చేయాలని, బ్యాంకు నుంచి గృహ రుణాలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ కేవీ రమాదేవి, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్ఐ

గార్లదిన్నె: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని శింగనమల సర్కిల్ సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ గౌస్‌మహమ్మద్ బాషా సూచించారు. ఆదివారం గార్లదిన్నె పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. లైసెన్స్ లేకుండా, హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలు నడుపుతున్న వారి వాహనాలు తనిఖీ చేయడంతోపాటు, రికార్డులు సక్రమంగా లేనివారికి జరిమానా విధించారు. వాహనదారులు బయటకు వచ్చినప్పుడు రికార్డులు వెంట తెచ్చుకోవాలన్నారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదని వాహనదారులకు సూచించారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

ఉరవకొండ: ఈనెల 4 నుంచి ప్రారంభమయ్యే గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఆదివారం ఏర్పాట్లను గవిమఠం సహాయ కమిషనర్, మేనేజర్ కె.రాణి పర్యవేక్షించారు. సహాయ కమిషనర్ మాట్లాడుతూ గవిమఠం బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు జిల్లా నలమూలల నుంచే కాక కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారన్నారు. ఎండ నుంచి రక్షణ పొంది భక్తులు సేద తీరేందుకు చలువ పందిళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాత్కాలిక కొళాయిలు, చల్లని నీటి కోసం కుండలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్లు గోపి, నారాయణస్వామి పాల్గొన్నారు.

గాజుల అంగళ్లు కిటకిట



తాడిపత్రి రూరల్: పట్టణంలోని గాంధీకట్ట వద్ద గాజుల అంగళ్లు కిటకిటలాడుతున్నాయి. బుగ్గ రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలు, శివరాత్రి పండుగను పురస్కరించుకుని గాజుల అంగళ్లను ఏర్పాటు చేశారు. దుకాణాల్లోఇ పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చి రకరకాల గాజులను కొనుగోలు చేస్తున్నారు. ఏటా పది రోజుల పాటు గాజుల అంగళ్లను ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

ప్రమాదకరంగా ప్రయాణం..

తాడిపత్రి రూరల్: మార్చి1 నుంచి కొత్త చట్టం అమలులోకి వచ్చింది. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే రూ.1000 జరిమానా విధిస్తారన్న భయం ద్విచక్ర వాహనదారుల్లో కనిపించడం లేదు. కెపాసిటీకి మించి ద్విచక్రవాహనాల్లో ప్రయాణిస్తూ ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. పట్టణంలో రోజూ పెద్ద సంఖ్యలో ద్విచక్రవాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రధాన సీబీ రోడ్డు అక్కడక్కడా ఎగుడు దిగుడుగా ఉండటంతో ఏ సమయంలోనైనా ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది. గతంలో పలుమార్లు వాహనలు అదుపుతప్పి పలువురు ప్రాణాల మీదకు తెచ్చుకున్న సంఘటనలు కోకొల్లలు. పోలీసుల కళ్ల ముందే ద్విచక్ర వాహనాల్లో నలుగురు చొప్పున వెళుతున్న పట్టించుకోవడం లేదు. యువకులు శృతిమించిన వేగంతో వాహనాలను నడుపుతూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. హెల్మెట్ వాడకంపై ఏఎస్పీ రోహిత్‌కుమార్ ఆధ్వర్యంతో పోలీసులు ర్యాలీలు చేసిన ప్రజల్లో మార్పు రావడం లేదు.

కెపాసిటీకి మించి ద్విచక్రవాహనాల్లో ప్రయాణిస్తున్న దృశ్యం →





ఆర్టీసీ ఈయూ డిపో కమిటీ ఎన్నిక



ఆర్టీసీ ఈయూ డిపో కార్యవర్గ సభ్యులు

గుంతకల్లుటౌన్: ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ గుంతకల్లు డిపో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యూనియన్ రీజనల్ కార్యదర్శి పీఎస్.ఖాన్ తెలిపారు. ఆదివారం స్థానిక డిపో సమీపంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. డిపో కమిటీ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఏఆర్.రెడ్డి, ఎం.మల్లయ్య, కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఎంకె.మూర్తి, జి.కృష్ణను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఖాన్ సూచించారు. కార్యక్రమంలో రీజనల్ కమిటీ సభ్యులు ఓబుళరత్నం, కల్లప్ప, లోకేష్‌కుమార్, రఘువీర్, షాషావలి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం





అలంకరణలో చౌడేశ్వరీదేవి, జ్యోతులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

తాడిపత్రి రూరల్: పట్టణంలో ఆదివారం జ్యోతుల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. స్థానిక యల్లనూరు రోడ్డులో వెలసిన చౌడేశ్వరీదేవి ఆలయంలో జ్యోతుల ఊరేగింపును పురస్కరించుకుని అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

పెద్దవడుగూరు(పెద్దపప్పూరు): పెద్దపప్పూరు మండలంలోని జూటూరు సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యు సరఫరా నిలిపివేస్తామని ఏఈ నరసింహులు తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్న కారణంగా కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

టెంకాయల విక్రయ హక్కుకు నేడు వేలం

యాడికి: మండల కేంద్రంలో ఈ నెల 7 నుంచి నిర్వహించనున్న చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం ఆలయ ఆవరణలో ఉదయం 11 గంటలకు టెంకాయల విక్రయ హక్కుకు వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ దుర్గాప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనాలన్నారు.

గంగాదేవిపల్లిలో 5న వేలం

తాడిపత్రి రూరల్: మండలంలోని గంగాదేవిపల్లిలో గంగమ్మ ఆలయానికి సంబంధించి పలు విక్రయాల హక్కులపై ఈ నెల 5న వేలం నిర్వహిస్తున్నామని ఆదివారం దేవదాయశాఖ ఈఓ రామాంజనేయులు తెలిపారు. టెంకాయలు, తలనీలాలు, వసతి గదులు, హోటల్ నిర్వహణ, ఐస్‌క్రీంల విక్రయ హక్కుల కోసం వేలంలో పాల్గోనే వారు రూ.30 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.